# తెడ్డు రహస్యం

## అంట్యాకుల పైడిరాజు

మన తెలుగునాట ప్రతీ యేట అన్ని పండుగలు లాగానే అమ్మవారి పండుగ జరుగుతూ వుంటుంది, ఈ పండుగ చూడడానికి చుట్టూ వున్న పల్లెలలోంచి ప్రజలు పట్నం చేరు కుంటారు. మరునాడు సూర్యాస్తమయం కాగానే సిరిమాను తిరగడం చూసుకొని పిల్లలు, పెద్దలు ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకుంటారు. ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు.

ఇలాంటి సంబరాలు పిల్లలకు చాలా వుత్సాహ కరంగా వుంటాయి. బాగోతం, తోలుబొమ్మలాట, బుర్ర కథలు తెల్లార్లు తిలకిస్తారు ప్రజలు.

ఈ సంబరాలలో ప్రదర్శించే విద్యలలో "గరడీ విద్య" ఒకటి. గరిడీ విద్య అనగానే "కర్రసాము", "కత్తిసాము" జ్ఞాపకం రాక తప్పవు.

సాము చేయడానికి వాడబడే పరికరాలన్నిదెబ్బలాట్లకు సంబంధించినవే. కర్ర, కత్తి, బాకు, ఈటె, విల్లు, గద ఇలాటి పరికరాలు ఎన్నెన్నో వుంటాయి. ఆయా ప్రాంతాల వాడుకలను బట్టి ఆయా పరికరాలు మారుతూ వుంటాయి. గరడీ విద్య ప్రదర్శించినప్పుడు లయబద్ధంగా అడుగులు వేసుకుంటు డప్పుదరువు కనుకూలంగా చేస్తారు. శాస్త్రబద్ధంగా వుంటుంది ఆ విద్య.

ఇలాంటి పరికరాలతో సాము చేసి ఎదుటి పోటీ దారుడ్ని ఓడించడమే ఈ విద్య ముఖ్య ఉద్దేశం. కాని ఒకరిపై ఒకరు ద్వేషభావాలు తీర్చుకుందికి ఆ ప్రదర్శనలను ఉపయోగించరు.

"యుద్ధ రంగంలో మాత్రం ద్వేషిని వాటితో హతమారుస్తారు"

ఈ గరడీ విద్యలో పేరుగడించిన వారుఅక్కడక్కడ వుంటారు. అలా పోటీలలో పాల్గొని పేరు ప్రఖ్యాతులు గడించిన వారిలో "భీమన్న" ఒకడు.

అనేక చోట్ల గరడీ ప్రదర్శనలిచ్చి పోటీదార్లను జయించి బహుమానాలు, బిరుదులూ పొందాడు భీమన్న.

భీమన్న గొప్ప బలాఢ్యుడని వేరుగాచెప్పనక్కరలేదు. కుస్తీ, మల్లయుద్ధం, సందిడి రాళ్ళు ఎత్తడం. విజయ నగరం కోడి రామమూర్తిగారి లాగా ఛాతీపై బరువైన రాతి బండ నెక్కించి బండపై సుత్తి దెబ్బలు కొట్టించడము. లావుపాటి ఒడ్డు తాళ్ళను తెంచడము. ఇలా ఎన్నెన్నో రకరకాల విద్యలు ప్రదర్శించి శభాష్ అనిపించుకున్న భీమన్న "కలియుగ భీమ" అన్న బిరుదు పొందాడు. కాళ్ళకు వెండి తోడా వేశారు భీమన్నకు.

భీమన్న గురువు రామన్న, అన్ని విద్యలలోను ఆరి తేరిన వ్యక్తి. బాగా వయసు మళ్లినవాడు రామన్న. భీమన్నను చేరదీసి అన్ని విద్యలు నేర్పాడు. కాని కొన్ని రహస్యాలు చెప్పలేదు. తాను నేర్చుకున్న దానితో తృప్తి పడ్డాడు భీమన్న.

కొంత కాలమయ్యాక భీమన్న "గురువుకు మించిన శిష్యుడని" ప్రజలు పొగడడం మొదలుపెట్టారు.

భీమన్నను గురువు ఎదుటకూడా పొగడడంమొదలు పెట్టారు.

భీమన్నను అలా పొగగడం గురువు ఎంత మాత్రము ఇష్టపడేవాడు కాదు.

ఎవరైనా ఏమైనా పొగిడితే వాడి మొఖం వాడికేమీ తెలీదు అనే వాడు గురువు రామన్న.

గురువు రామన్నకు శిష్యునిపైకలతిరస్కార బుద్ధి సహించలేక కొంత మంది విరోధస్తులు. గురువన్న మాటలు శిష్యునికి, శిష్యుడన్న మాటలు గురువుకి చేరవెయ్యడం ప్రారంభించారు.

భీమన్న గురువుమీద కారాలు మిరియాలు నూరడం ప్రారంభించాడు.

గురు శిష్యుల మధ్య భేదం అగ్గి మీద గుగ్గిలంలా భగ్గున మండడం ప్రారంభమైంది.

కొన్నాళ్ళకు గ్రామదేవత పండుగ రానే వచ్చింది. సమయం వచ్చింది కదా అని పురప్రముఖులు గురు శిష్యుల మధ్య పోటీ ప్రదర్శనం ఏర్పాటు చేశారు.

తనతో పోటీకి గురువొప్పుకున్నందుకు భీమన్నకు పరమానందమై పోయింది. ఈ దెబ్బతో గురువుకి బుద్ధి చెప్పవచ్చని అనుకున్నాడు భీమన్న.

జనమంతా గరడీ విద్య ప్రదర్శించే చోటుకి కోలాహలంగా చేరుకున్నారు. ఎలాగైతేనేమీ కొంత సేపటికి గరిడీ ప్రదర్శనం ప్రారంభమైంది.

గురువొక ప్రక్క నుంచి, శిష్యుడొక ప్రక్క నంచి కర్రలతో సాము చేసుకుంటూ పెద్దలు నిర్ణయించిన గిరి, చుట్టూ తిరుగుతున్నారు. ఒకరు వేసిన పేచీకి మరొకరు ఇలా ఒకరికొకరు జవాబుచెప్పకుంటున్నారు. డప్పు దరువుప్రకారంగా కాళ్ళతో లయలు వేసుకుంటు ముందుకి వెనక్కి అడుగులువేసి కర్రలు, కత్తులు త్రిప్పడం ప్రేక్షకులకు ఎంతో ఉత్సాహాన్ని ఉద్రేకాన్ని కలిగించింది, పిల్లలు పెద్దలు కళ్ళప్పగించి చూస్తున్నారు. అంతా నిశ్శబ్దం, ఫైటింగు స్పిరిటు అందరిలోను ప్రబలి పోయింది. కథ మంచి రసవంతంగా వుంది.

ఒక పరికరం తరువాత మరి యొక పరికరం



మార్చుకుంటూ దేనికి తగ్గ లయ దాని కనుకూలంగా వేసుకుంటూ ఉద్రేకంగా సాము చేస్తున్నారు. నువ్వా నేనా అన్నంత హోరా హోరీగా యుద్ధం చేస్తున్నారు. ఉద్రేక పూరితమైన పౌరుషం ఇరువురిలో బయలుదేరింది. ఇద్దరిలోను ఎవరు ఓడిపోతారా అన్న అనుమానం ప్రబలుతూ వచ్చింది ప్రజలలో.

ఒకరి మీద ఒకరు కసిగా మాటలు విసురు కుంటు న్నారు.

గురుశిష్యుల మధ్య ఎవరి చేతనున్నఆయుధం క్రింద పడలేదు. ఒకరి పట్టు ఒకరికి తెలుసును కనుక, ఎవ్వరి కెవ్వరూ తీసిపోలేదు.

గురువు బలహీనతను కనిపెట్టి ఒక దెబ్బతో ఓడించ గలనని అనుకున్నాడు భీమన్న. తన వ్యూహాలన్నీ తారు మారైనాయి.

ఇక ఆఖరు ఘట్టానికొచ్చింది కథ. ఇకగురువు ఇచ్చిన సమస్య శిష్యుడు తీర్చాలి. రహస్యంగా అంత వరకు దాచి వుంచిన రెండు "తెడ్లు" బయటకు తీశాడు గరువు.

రెండు తెడ్లతో అతి చమత్కారంగా సాము చేసు కుంటూ గిరిలోకి దిగాడు గురువు రామన్న.

భీమన్న చేతికి ఒక తెడ్డు అందించాడు గురువు రామన్న. కాని భీమన్న ఆ తెడ్డు తిప్పకుంటూ గిరిలోకి దూకలేదు. మిత్రులందరు భీమన్నకు హుషారు కల్పించి గిరిలోకి తోయసాగారు. భీమన్న ససేమిరా అన్నాడు. తెడ్డుతో సాము ఎలా చేయడం అది నా వల్ల కాదన్నాడు. ఏమీ తోచక తికమక పడ్డాడు భీమన్న.

"ఈ తెడ్డు రహస్యం" ఎప్పుడూ చెప్పలేదే? ఈ గురువు వట్టి కపటి. తనలో తాను గొనుక్కున్నాడు. గురువుపై గుడ్లెర్ర జేశాడు. గురువుని కర్రతో బాదే ద్దామన్నంత కోపం వచ్చింది భీమన్నకు. ఇక ఏమీ లాభం.

ఇంత బలాఢ్యుడు పిరికి వాడయి పోయినాడు "!కలియుగ భీముడు" చేసేది లేక గురువు మీద కోపొద్రిక్తుడై గిరిలో వున్న గురువు వద్దకు పరుగెత్తు కొని వెళ్ళి నిలవదీసి అడిగాడు ఎందుకింత అంత్ర బుద్ధి చూపుతున్నావని. గురువు మీద కలియబడ్డాడు భీమన్న.

గురు శిష్యులవాదం ప్రేక్షకులందరిని ఆశ్చర్య చకితులను చేసింది.

"తెడ్డుని ఎవడైనా సాముకి తెస్తాడా"? అని గర్జించి అడిగాడు భీమన్న.

"తెడ్డు కూడా కర్రతోనే చేయబడింది. అవసర మైనప్పుడు సమయాన్ని బట్టి ఏ వస్తువైనా వాడవచ్చు నోయ్", అని బిగ్గరగా కేకలేశాడు గురువు రామన్న.

కల్లోలమంతా ఒకేసారి నిశ్శబ్దమైపోయింది. గురువు చెప్పే తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు ప్రేక్షకులు.

భీమన్నకు రామన్న ఇంకా ఇలా బుద్ధి చెప్పడం ప్రారంభించాడు.

ఓయి భీమన్న, నీకు శరీర బలమైతే వుందికాని ఏమి లాభం, బుద్ధి బలం లేదు నీకు, అది నిరూపించడానికే తెడ్డుతో సాము చేసి చూపాను.

నేర్చుకున్న విద్య, నేర్చుకున్న పరికరాలతో యధా తథంగా అప్పజెప్పడం కాదోయ్ విద్యకు కావలసింది. ఏ కొత్త సమస్య వచ్చినా శాస్త్రబద్ధమైన మనోధర్మంతో పరిష్కరించాలి. అప్పుడేనీ విద్యరాణిస్తుంది. లే నప్పుడు నీ కొచ్చినకీర్తి వ్యర్థమవుతుంది. నీవు తెలుసుకోవలసింది, తెలియజేయవలసింది ఎంతోవుంటుందని గ్రహించుకో, అని భీమన్నకు గుణపాఠం నేర్పాడు రామన్న "గురువు గురువే" శిష్యుడు శిష్యుడే అని దారి తీశారు ప్రజలు.

## అగరుబత్తి—అగ్గిపుల్ల

నీవు — నేను
ఇద్దరమూ బూడిదైపోయే వాళ్ళమే!
నా పరిమళం
గది నిండా పరచుకుంటూంది!!
నన్ను వెలిగించిన నీ స్మృతి—
నా గుండె నిండా నిండిపోతుంది!!!

—దొడ్లంకి వెంకట్రావ్

